# అలిసిన సముద్రం

అటువేపు వెడుతున్న చాలామంది చూశారు ఆమె వేపు. పార్క్ గడ్డిలో పడుకునుంది.

మోకాళ్ళ పైదాకా చీర లేచి పోయింది. పక్కకి తిరిగి పడుకున్నా. నడుం పై భాగం చాలా వరకూ ఎల్లకిత్తులా వుంది.

స్టేషన్ దగ్గర మూడు రోడ్ల మధ్యనున్న ఆ పార్క్‌లో .... ఉదయం తొమ్మిది దాటిన ఆ సమయంలో మత్తుగా నిద్రపోతోంది ఆ ఆడ శరీరం.

పార్క్ పక్కగా నడుస్తున్న వాళ్ళలో కొందరు నడక వేగం తగ్గించి, మరి కొందరు ఓ నిమిషం ఆగి మరీ చూశారు.

పగటి వెలుగులో.... పార్క్ నేల మీద.... విచ్చల విడిగా అలా పడుకున్న ఆమెని చూసిన చాలామంది మగాళ్ళకి ప్రొవకేటివ్‌గా వుంది....



# వి.రాజా రామమోహనరావు

అడాళ్ళకి ఆశ్చర్యంగా వుంది.... ఆశ్చర్యపడ్డ ఆడవాళ్ళలో కొంత మంది 'అవ్వ....' అనుకున్నారు. ఆమె జాకెట్టుకి పై హుక్ లేదు. తెగి పోయింది.... పెద్ద పరిమాణపు గుండెలు.... సగం వరకూ పార్క్ ఎండ పాలపుతున్నాయి. వాళ్ళెర గని బలమైన ఉఛ్వాస నిశ్వాసాలకి ఆమె హృదయం కదలికలు కనపడ కపోతే, ఆమె చచ్చి పోయిందేమో అన్నట్టుగా నిద్రపోతోంది.

* * *

ఆ రాత్రి పూర్తిగా చచ్చిపోయి నట్టుంది కాంతానికి. చీకటి కూడా



చిక్కగా లేకుండా వెలతెలా పోతు న్నట్టు కనపడింది.
చేస్తున్న పని .... పరిసరం.... వాతావరణం అన్నీ అనాసక్తంగా ఉన్నాయి. అయినా అవసరం.
కొంత మందికి బతుకు ఒక బతుకు లాగే ఉంటుంది. కానీ మరి కొంత మందికి బతుకు కొన్ని వందల బతుకుల్లాగా వుంటుంది. అలాంటి వాళ్ళలోదే కాంతం....
పల్లెలో పతితనం .... అక్కడ బతుగడవక పట్నం వచ్చిన తల్లి దండ్రుల రేఖా మాత్రం జ్ఞాపకాలు వో బతుకైతే.... దిక్కూమొక్కూ లేని అనాధగా మురిక్కాలవల పాకల మధ్య బతికింది మరో బతుకు.... ఆ మురికి వాతావరణం మధ్య తల్లీ తండ్రీ కరువైన వొం టరి ఆడపిల్లగా ఎక్కువ రోజులు కన్యగా కాంతం మిగలంది మరో బతుకు.
ఆ తర్వాత చేతులుమారి .... చోట్లు మారి.... ఎన్నో బతుకులు మారి చివరికి పూర్తిగా నడివీధి పాలైంది కాంతం.... ఇప్పుడు కాంతాన్ని ఎవరు ఏ భాషలో వ్యవహరించినా అదే అర్థం.... అంతే అసహ్యం.
'సమగ్రమైన బతుక్కేం వుండాలి?' అన్న ప్రశ్నకి సమాధానం చెప్పా ల్సివస్తే మేధావులందరూ కాస్సే పైనా ఆలోచించక తప్పదేమో! కానీ కాంతం మాత్రం తన వరకూ వీధి వ్యభిచారపు బతుక్కి ఏమేం వుండకూడదో వెంటనే ఒక్క క్షణమైనా ఆలోచించకుండా చెప్పే స్తుంది.
పోలీసుల, రౌడీల మామూళ్ళుండ కూడదు.... వాళ్ళ భయం వుండ కూడదు.... అనారోగ్యంతో గవర్న మెంట్ ఆస్పత్రికెడితే తమతో అన్ని రకాల బూతు వాగుడు వాగి వో పట్టాన ఇంజక్షనివ్వక.... మాన సికంగా హింసించే హింసుండ కూడదు.... ఇవిలేకుండా వొళ్ళ మ్మకోటానికి చిన్న నాలుగు తడి కెల చోటుంటే చాలనేస్తుంది. అలా వుంటే ఆ మాత్రపు సౌకర్యం వుంటే జీవితం గొప్పగా మెరుగు పడిపోయినట్టు ఆనందించెయ్యగల స్థితిలో వుంది కాంతం బతుకు.

మర్యాదల ముసుగు చాటున మన
క్షుతి తీర్చడానికీ, మన వాంఛలు తీర
డానికి వేశ్యలుండాలి. మన భార్యలు పతి
వ్రతలై వుండి పాతివత్యం కాపాడుకోవాలి
నిర్లజ్జగా బతకడమే జీవితంగా మారిన
ఆ జాతి స్త్రీలు అలసిన సముద్రాలు...
ఎత్తండి మీ ఓడల తెరచాపలు - దింపండి లంగర్లను!!

అయినా ఇప్పుడు కాంతానికి పోలీసుల భయంలేదు. రౌడీల భయం లేదు... ఆరోగ్యం గురించి పట్టించుకునే ఆసక్తి, అవకాశం లేవు... వీటన్నింటికీ మించి కాంతాన్ని కమ్ముకున్న భయం... కాబూలీ భయం...

రెండు నెలల క్రితం కాబూలీ దగ్గర యాభై రూపాయలు అప్పు చేసింది కాంతం. కాబూలీ అప్పు బాధ తెలియక కాదు... తెలిసే చేసింది... కానీ, ఆ బాధ యింత భయంకరంగా వుంటుందని తెలీదు... కిందటినెల వాడికి వడ్డీ ఇవ్వ లేకపోయింది. అందుకే ఆ బాధ మరీ దారుణంగా తయారైంది... మర్నాడు వస్తాడు.. తెల్లారేలోపల రెండు నెలల వడ్డీ ముప్పై రూపాయలుసంపాదించాలి.. రాత్రి చూస్తే నిర్జీవంగా వుంది... యీ మధ్య చాలా రాత్రులిలాగే వుంటున్నాయి... రోజు గడవటానికి తప్ప ఓ రూపాయేనా దాచటానిక ఏ రాత్రీ పనికి రావటం లేదు...

ఆ రాత్రి ఎనిమిదింటి దగ్గరనించీ తిరుగుతోంది. ఆ రోడ్లన్నీ కలయ తిరిగింది... ఆ నాలుగ్గంటల్లో కనీసం యిరవై మైళ్ళైనా తిరిగుంటుంది. నీరసంగా వుంది కాంతానికి... మానసికంగా నిస్సత్తువగా వుంది.

తన పని అయిపోయిందా... ఏ మగ కంటికీ తన వొళ్ళు పని కొచ్చేలా కనపట్టంలేదా?... వయసు ముప్పై

ఐనా దాటకుండా తనపని ఇలా అయిపోతే... యింక బతుకంతా ఎల్లా?... కాంతాన్ని తరచుగా భయపెట్టే ఆలోచన, శరీరం తప్ప మరే ఆధారం లేని బతుకు బెంగ... ఆ బెంగతోనే అడుక్కుంటే?... అనిపించింది కాంతానికి... మళ్ళీ... ఛీ అడుక్కోటమా... అనిపించింది.

'ఛీ... ఎప్పటికేనా యీ బతుక్కి ఆ గతి తప్పదు... అయినా ఇప్పుడెందుకా ఆలోచన... ఆ రోజొస్తే అప్పుడు చూసుకోవచ్చు...' అని ధైర్యం చెప్పుకుంది.

భయం ... ధైర్యం ... నిరుత్సాహం... తెచ్చుకుంటున్న వోపిక... యింకక్కడ నిలబళ్ళేదు కాంతం. కదలకుండా ఒకే చోటుంటే ఆలోచనలు ఇబ్బందిగా వున్నాయి... మళ్ళీ రోడ్లమ్మట తిరగటం మొదలెట్టింది...

రాత్రి నిశీధిగా మారింది... ఇంచుమించు జనం తిరగటం ఆగిపోయింది... నిద్రరాని కుక్కలు తిరుగుతున్నాయి..,

అప్పటికి ఆ రాత్రి ఎందర్నో పలకరించింది.. ఎన్నో చీకటి నవ్వులు నవ్వింది...

మంచి బేరాలైతే రెండు... మామూలు బేరాలైతే మూడు చాలని ఆశపడింది ఆ రాత్రి కాంతం.

ఒకళ్ళిద్దరు మాట్లాడారు.. కుదర్లేదు. ప్రతీ రాత్రీ బేరాలు వెతుక్కునే యాతన తప్పదు కాంతానికి. మానవ అసహ్యాన్ని నవ్వుతూ ఆహ్వానించే నరకం తప్పదు.

శరీరాన్ని అప్పగించటం కన్నా, శరీరాన్ని అమ్మకానికి స్వయంగా అలా రోడ్లమ్మట తిప్పటం మరీ బాధ ఏ ఆడదానికేనా... ఆ బాధ అలవాటున్నదే అయినా, ఆ రాత్రి ఆ సమయంలో ఆ బాధ దుర్భరం అనిపించింది.

కళ్ళ నిండుగా నీళ్ళొచ్చాయి కాంతానికి... చీకట్లోనే కళ్ళు తుడుచుకుంది.

ఒంటరిగా, అగమ్యంగా... అయోమయంగా... తెల్లారు ఝామున మూడింటికి పిచ్చిగా రోడ్లమ్మట తిరుగుతున్న కాంతానికి తన బతుక్కన్నా ప్రతి జంతువు బతుకు మేలే- అనిపించింది.

ఇది వరకు ఇంత యాతన పడేది కాదు... పన్నెండూ ఒంటిగంట దాకా చూసి బేరం దొరక్కపోతే పడుకునేది... అలా చేసినా తిండి బాధ తప్ప మరో బాధ లేదు.

కాని ఇప్పుడు... ఈ అప్పు బాధ... కాబూలీ అసహ్యమైన మాటల బాధ... ప్రతి మనిషిలోనూ ఏ

మూలో మిగిలి వుండే మానుష త్వాన్ని హింసించే బాధ...

'ఎరక్కపోయిఅనవసరంగా చేశానీ అప్పు...' అని మళ్ళీ తనను తనో సారి తిట్టుకుంది కాంతం.

ఆ క్షణాన బాధ తట్టుకోలేక అలా తిట్టుకున్నా, నిజానికి ఆ అప్పు చెయ్యక తప్పనిదని కాంతానికీ తెలుసు.

ఆ రాత్రి... యిలాగే బేరాలకోసం తిరుగుతోంది . . పోలీసు వేనొచ్చి ఆగటం...తనని తనలాంటి వాళ్ళని వేన్‌లో కుక్కటం నిమిషాల మీద జరిగిపోయింది...

కోర్టులో తమ బతుకు తప్పుగా యాభై రూపాయలు జరిమానా వేశారు. అది కట్టకపోతే జైలు కెళ్ళాలి...

జీవితంలో చాలా చూసింది కానీ కాంతం యింకా జైలు బతుకు చూళ్ళేదు.. చూళ్ళేదు కాబట్టి జైలంటే చాలా భయపడింది. అందుకే కాబూలీదగ్గర అప్పు చేసింది... జైలు భయం నుంచి తప్పించుకోడానికి అలా చెయ్యక తప్పలేదు. జరిగిందంతా జరిగిపోయిందని తెలిసినా... ఎలా జరిగిందో అర్థంకాలేదు కాంతానికి... మామూళ్ళు మామూలుగానే వసూలు చేసి మళ్ళీ తన్నెందుకు ఆ రాత్రి పట్టుకున్నారో అర్థంకాలేదు. అదే విషయం పరిచయమున్న వో కానిస్టేబుల్‌ని అడిగింది.

"ఒక్కోసారి తప్పదు... ఎవరం ఏం చెయ్యలేం, అంతే..." అన్నాడతను...

'ఏం చెయ్యకపోతే పోయారు... కనీసం ఆనెల తీసుకున్న నా మామూలేనా వెనక్కిచ్చేస్తే కాబూలీ దగ్గర అప్పు కొంతేనా తగ్గును...' అనుకుంది కొంతం.

పూర్తి నిస్సత్తువగా వుంది కాంతానికి... కాళ్ళు నడవనివ్వటం లేదు. మనసు కూచోనివ్వటం లేదు... ఎంతో అలజడిగా, అస్థిమితంగా వుంది...

'యీసారి పోలీసులు పట్టుకుంటే జైలుకేనా వెళ్ళిపోతాను కానీ తిరిగి అప్పు చెయ్యను ... ఎలాగయినా గండం గడిచేలా చూడు భగవంతుడా...' అని మొక్కుకుంది.

ఇంకో గంట గడిస్తే వెలుగొస్తుందన్న భయంగా వుంది కాంతానికి... రాత్రంతా తిరిగి— తిరిగి పడిన శ్రమంతా వృధా అవుతుందే అన్న దిగులుగా వుంది... నాలుగు గోడల మధ్య వో గూడు నీడన బతికే ఏ స్త్రీకి కలగని చిత్రమైన దిగులది... కేవలం కాంతం లాంటి వాళ్ళకే తెలిసిన దిగులది...

చివరికి యింక వోపిక నశించి పార్క్ పక్కన కూలబడింది కాంతం...
నాలుగవుతుంటే తిరిగి ఆశ చిగురించింది. గుంపుగా మాట్లాడుకుంటూ వస్తున్నారు వాళ్ళు...
వోపిక లేకపోయినా, పెద్ద నమ్మకం లేకపోయినా, కూచున్నకాంతం లేచి నిలబడింది... వాళ్ళ ముందు కొచ్చింది... పిలిచింది... ఒంటరి ఆడది ... మొత్తం ఆరుగుర్ని పిలిచింది...
వాళ్ళుఆగి, "ఎంత?" అన్నారు...
కాంతం చెప్పింది...
"అమ్మో... అంతే..." అంటూ వాళ్ళు వెళ్ళిపోబోయారు...
కాంతం కంగారు పడింది... ఆ రాత్రి ఆఖరి అడుగులేసుకుంటూ వెళ్ళిపోతున్నంత కంగారు పడింది.
"పోనీ పది... పది యివ్వండి..." అంది. వాళ్ళు ఆగారు.
పది చొప్పుని లెఖ్ఖలేసుకుంటోంది కాంతం...
కాంతం లెఖ్ఖలు పూర్తి కాకుండానే వాళ్ళు... "అయిదు..." అన్నారు.
బక్కచిక్కిపోయింది కాంతం.... పూర్తిగా నిరాశతో చచ్చిపోయింది కాంతం... మాట్లాడకుండా తిరిగి కింద కూలబడింది.
ఆ తర్వాత వాళ్ళే బేరమాడారు...
"ఎంత... యింక గట్టిగా గంటేనా లేదు తెల్లారటానికి... టైము సరిపోదు... నీకు పెద్దగా యిబ్బంది వుండదు..." అన్నారు.
చివరికి నలభై అయిదుకు వొప్పుకున్నారు,
వెలతెలాబోతున్న చీకట్లో... ఆ ఆరుగుర్ని కలిసింది కాంతం...
రాత్రి తెల్లారటానికి మిగిలిన ఆ గంటలో ఆరుగురితో అరవై గంటల శ్రమ పడింది... శరీరం శవంలా తయారైంది...
ముప్ఫై వడ్డీకిపోతే ... అయిదు తిండికి పోతే... మరో పది అప్పు కట్టొచ్చు... వడ్డీ తగ్గుతుంది వచ్చే నెలకి... అని వెర్రి సంతోషపడింది కాంతం.
ఆ ఆరుగురికి వొళ్ళప్పగించటం పూర్తయ్యాక అప్పుడే తెరిచిన యిరానీ హోటల్లో ఆబగా... అల

సటగా... రెండు రొట్టెలు తిని... ఎంతో భారంగా, నీరసంగా శరీరాన్ని తెల తెలవారుతుండగా ఆ పార్క్‌కి చేర్చింది కాంతం... చేర్చిన తర్వాత కాంతానికి యింక వొళ్ళు తెలియ లేదు.

* * *

తెల్లారి తొమ్మిదైనా... సభ్య ప్రపంచం అంతాచూస్తున్నా...ఎండ పొడుస్తున్నా... పార్క్‌లో వొళ్ళెరక్కుండా నిద్రపోతోంది కాంతం. "ఛీ... ఇదీ వో అడదే...బొత్తిగా సిగ్గు లేకుండా ఆ పడకా... అదీనూ..." అనుకున్నారు చాలా మంది కాంతాన్ని చూసి...

నిర్లజ్జగా బతకటమే జీవితంగా మారిన కాంతం... అన్ని రకాలుగా ఆమె సిగ్గు దిగజారటానికే చాలా శక్తులు ఉపయోగ పడుతున్న కాంతం... తను ఆడదాన్నని ఎప్పుడో మరిచిపోయింది. మరిచిపోకపోతే బతకలేదు కాంతం.

సిగ్గు పట్టానికి సిగ్గు మెయింటేన్ చెయ్యటానికి కాంతానికి శక్తిలేదు. కాంతానికే కాదు... కాంతం తోటి సీతకి, వనజకి, బీబీకి, మేరీకి... యిలా చాలా చాలా మందికి లేదు. వాళ్ళని చూసి... వాళ్ళని అనుభవించి... వాళ్ళ గురించి... వాళ్ళ రాత్రి నరకాల గురించి తెలిసీ తెలియక... చీదరించుకునే శక్తిమాత్రం చాలా మందికి వుంది.

కానీ, అలా...అలా ప్రతిరాత్రి మరింతగా అలిసి... మరింతగా విస్తరిస్తున్న ఆ అనంత స్త్రీ సముద్రాన్ని బాధగా, బాధ్యతగా చూసే శక్తీ, వోర్పు, అవకాశం చాలా మందికి లేదు.

ఎండెక్కినా అలా సిగ్గులేకుండా... పార్కుల్లో, రోడ్ల పక్కనా వొళ్ళెరక్కుండా నిద్రపోయే అడాళ్ళని... ప్రతిరాత్రి ఒక్కో రకం నరక యాతనికి, అనేక రకాల శ్రమకి లోనై నలిగిన వాళ్ళ శిథిల శరీరాలని అసహ్యించుకోటానికి... అన్ని రకాలుగా అలిసిన ఆ స్త్రీ సముద్రం మీద అధికారం చెలాయించడానికి పెద్ద శక్తి అక్ఖర్లేదు. వో పది రూపాయల్చాలు... మర్యాద ముసుగు చాటు చాలు... కాస్త అమానుషం చాలు... సముద్రాన్ని మలినజలంగా చూడగలిగిన అలవాటు చాలు... *